క్లుప్తంగా

బదిలీలు సర్వసాధారణం.. అభివృద్ధి శాశ్వతం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఏ స్థాయి అధికారికైనా బదిలీ సర్వసాధారణమని.. కానీ వారు చేసిన అభివృద్ధే శాశ్వతంగా నిలిచిపోతుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ధ్యానచంద్ర, తిరుపతి కమిషనర్ అదిత్‌సింగ్‌కు ఉద్యోగులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ప్రాంతంలో ఎంతకాలం పనిచేసినా మనం చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా ఉంటాయన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి ఆర్వోగా అదిత్‌సింగ్, వెంకటగిరి ఆర్వోగా ధ్యానచంద్ర ఐక్యతతో విజయవంతంగా ఎన్నికలు చేపట్టారని కొనియాడారు. కడప జిల్లా జేసీగా వెళుతున్న అదిత్‌సింగ్, విజయవాడ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళుతున్న ధ్యానచంద్ర మంచి సేవలు అందించి ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఆర్డీవోలు నిషాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రాజారఘువీర్, మేనేజర్ వై.సుమతి, పలువురు తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్.. మెగా ప్లాంటేషన్



దశరథరామిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను సెప్టెంబర్ 15వ తేదీ వరకు కొనసాగిస్తామని ఉద్యానవనశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 350 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగుచేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 4 కంపెనీలు ఆయిల్ పామ్ మీద పనిచేస్తున్నాయని వివరించారు. ఒక హెక్టారుకి 143 మొక్కలు అవసరం కాగా.. వాటికి రాయితీ ఉంటుందన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలైతే హెక్టారుకి రూ.29,000, స్వదేశీ రకాలైతే రూ.20,000 రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా నిర్వహణ ఖర్చులకు రూ.5,250 అందిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు సమీప మండల ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

గుండె పోటుతో యువకుడి మృతి?

రామచంద్రాపురం: గుండెపోటుతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని అనుప్పల్లి పంచాయతీ, రేకలచేను గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హేమంత్ (31) వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఏమైందో గానీ పొలంలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని చూసి కుక్కలు గట్టిగా అరవడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. హేమంత్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందాడన్న అనుమానంతో విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిప్రసాద్ ఘటనా స్థలానికి చేరకుని హేమంత్ మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఎలాంటి విద్యుత్ షాక్ తగలలేదని నిర్ధారించారు. గుండెపోటుతో మృతిచెంది ఉండొచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

అధ్యక్షా.. ఇదే మా ఆకాంక్ష!



'జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలన్నా.. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని కొనసాగించాలన్నా అసెంబ్లీ వేదికగా కూటమి ఎమ్మెల్యేలు గళం విప్పాలి. నూతన పరిశ్రమలకు నాంది పలికేవిధంగా ఒత్తిడి తేవాలి. అర్ధంతరంగా ఆగిన సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తిచేయాలి. గుంతలమయమైన రోడ్ల కోసం మరిన్ని నిధులు రాబట్టాలి. ఎన్నికల హామీల్లో ప్రధానమైన సూపర్ సిక్స్‌ను తక్షణం అమలు చేసే దిశగా చొరచూపాలి. విద్య, వైద్య రంగాలను అత్యున్నతంగా తీర్చిదిద్దాలి. అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచేవిధంగా బాబును ఒప్పించాలి. మత్యకార భరోసా నిధుల విడుదలకు డిమాండ్ చేయాలి' అని జిల్లా ప్రజానీకం ముక్తకంఠంతో నినదిస్తోంది. అమాత్యులు లేని జిల్లాను అభివృద్ధి పథంలో నడపాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. ప్రజల ఆశలు.. ఆకాంక్షను నెరవేర్చాలని సూచిస్తోంది.

అసెంబ్లీ సమావేశాలపై కోటి ఆశలు

- ప్రగతిపై గళం విప్పే బాధ్యత ఎమ్మెల్యేలదే
- కూటమి మేనిఫెస్టో అమలుకు డిమాండ్ చేయాలి
- గత ప్రభుత్వం చేపట్టిన స్కిల్ వర్సిటీని పూర్తిచేయాలి
- విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లాలో తాగు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి
- సూపర్‌సిక్స్ హామీల బాధ్యత ప్రజాప్రతినిధులదే
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజానీకం



తిరుపతి సిటీ, తిరుపతి అర్బన్: జిల్లాలో ప్రాజెక్టుల అభివృద్ధిపై గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా ఆల్తూరు పాడు రిజర్వాయర్ విస్తరణకు రూ.600 కోట్లు కేటాయించింది. కానీ అప్పటి ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లను బెదిరించడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుపై అసెంబ్లీలో గళం వినిపించాలని ఆ ప్రాంత వాసులు సూచిస్తున్నారు. అదేవిధంగా మేర్లపాక లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.250 కోట్లు, ఆల్లూరుపాడుకు రూ.110 కోట్లు, మూలకాలువ ప్రాజెక్టుకు రూ.40 కోట్లు గత ప్రభుత్వం కేటాయించింది. మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.12 కోట్లకు పైగా వెచ్చించింది. పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు ఆదునికీకరణకు రూ.35 కోట్లు , కాలంగి రిజర్వాయర్‌కు రూ.8 కోట్లు, కళ్యాణి డ్యామ్‌కు రూ.3.5 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్ట్ అభివృద్ధికి రూ.1,250 కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేసింది. 35 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి రబీతో పాటు ఖరీఫ్‌నకు రెండు సీజన్లలోనూ సాగునీరు అందించింది. గత ప్రభుత్వం కేటాయించిన నిధులతో కొనసాగుతున్న పనులను నిలుపుదల చేయకుండా కొనసాగించేలా ప్రజాప్రతినిధులు అసెంబ్లీ వేదికగా గట్టిగా గళమెత్తాలని జిల్లా ప్రజలు సూచిస్తున్నారు.

నూతన పరిశ్రమల స్థాపనకు నాందిపలకాలి



జిల్లాలో గత ప్రభుత్వ ప్రభుత్వం నూతన పరిశ్రమల స్థాపనకు రూ.21 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టింది. 44వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది. జపాన్, చైనా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ దేశాల నుంచి పేరొందిన పారిశ్రామిక వేత్తలు జిల్లాను సందర్శించి పెట్టుబడులకు సిద్ధమయ్యారు. సత్యవేడు శ్రీసిటీ, నాయుడుపేట సెజ్, శ్రీకాళహస్తి, ఏర్పేడు, గూడూరు, రేణిగుంట ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు అనేక కంపెనీలు మొగ్గు చూపాయి. ఇందులో భాగంగా గూడూరు పరిధిలో 12 వేల ఎకరాల్లో రూ.5,800 కోట్లతో క్రిస్ సిటీ పేరుతో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గత ప్రభుత్వం బీజం వేసింది. అదేవిధంగా తిరుపతిలో రూ.1000 కోట్లతో 450 ఎకరాలలో కాన్సెప్ట్ సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కూటమి ఎమ్మెల్యేలు ఈ పరిశ్రమల స్థాపనకు ఏకవాక్య తీర్మానం చేసి అసెంబ్లీలో గళం వినిపించాలి.

సూపర్‌సిక్స్‌పై గళం విప్పాలి



ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా హామీలిచ్చిన సూపర్ సిక్స్ మాట పూర్తిగా విస్మరించింది. అసెంబ్లీ సమావేశాలలో సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. రూ.3 వేల నిరుద్యోగ భృతి, జాబ్‌క్యాలెండర్, మెగా డీఎస్సీకి రీ నోటిఫికేషన్, తల్లికి వందనం, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్, అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు రూ.20వేల సాయం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి అంశాలపై చర్చ జరగాలని, వాటిని వెంటనే అమలు చేసే దిశగా ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సి ఉంది.

అన్నదాతకు వెన్నుదన్నుగా నిలవాలి



జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 445 ఆర్బీకేలు ఏర్పాటు చేసి, 5.20 లక్షల మంది రైతులకు సేవలందించింది. 1.80,654 మందికి రూ.706.07 కోట్లు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. ఉచిత పంటల బీమా పథకం ద్వారా 33,295 మందికి రూ.23.04 కోట్ల మేర ప్రీమియం చెల్లించింది. సున్నావడ్డీ ద్వారా 72,410 మందికి రూ.14 కోట్ల వడ్డీ రాయితీ కల్పించింది. 2023 కాలంలో 3,01,520 మందికి రూ.4,988 కోట్లు, ఖరీఫ్‌లో 52,132 మందికి రబీలో రూ.1,234 కోట్ల రుణాలు అందించింది. యంత్రసేవా పథకం ద్వారా 472 కష్టమర్ హెయిరింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు అందించింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులను విస్మరించకుండా వీటన్నింటినీ కొనసాగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

సంక్షేమం కొనసాగాలి



గత ప్రభుత్వం జిల్లాలోని 34 మండలాల్లో 691 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 16.64 లక్షల మందికి ఇంటివద్దకే పౌరసేవలను అందించింది. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను సుమారు 44,501మంది విద్యార్థులకు నిరాటంకంగా కొనసాగించింది. అమ్మఒడి పథకంలో భాగంగా ప్రతి ఏటా జిల్లాలో 2,20,890మందికి రూ.331.34కోట్లు పంపిణీ చేసింది. జిల్లాలోని 2,090 ప్రాథమిక పాఠశాలలు, 321 ప్రాథమికోన్నత, 524 ఉన్నత పాఠశాలలు, 189జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు, మనబడి పథకాల ద్వారా వేల కోట్లు ఖర్చు పెట్టి రూపురేఖలు మార్చింది. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, చేయూత, కాపునేస్తం, సున్నావడ్డీ, ఆసరా, శ్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా వేలది కోట్లు మహిళల ఖాతాల్లోకి నేరుగా జమచేసింది. వీటన్నింటినీ కొనసాగించేలా కూటమి ఎమ్మెల్యే కృషిచేయాలి.

మత్స్యకార భరోసా కోసం ఎదురు చూపు



జిల్లాలో 10 వేల మందికి పైగా మత్స్యకారులున్నారు. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో భృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచింది. మత్స్యకారుల ఉపాధిలో భాగంగా 3,669 మందికి రూ.3.66 కోట్లు 90 శాతం రాయితీతో రుణాలు ఇప్పించింది. ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు పెంచింది. మత్స్యకార భరోసాను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచింది. కానీ ఇంతవరకు ఈ నిధుల ఊసేలేదు. వెంటనే నిధులు మంజూరయ్యేలా ప్రజాప్రతినిధులు తమ గళాన్ని వినిపించాలి.

స్కిల్ వర్సిటీని పూర్తి చేయాలి



జిల్లాలో శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, కోబాక సమీపంలో గత ప్రభుత్వం రూ.150 కోట్లతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీని కోసం సుమారు 50ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం వర్సిటీని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ దిశగా అసెంబ్లీలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గళం విప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ప్రధానంగా ఉచిత బస్సు, కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలలోనే అమలు చేస్తారని నమ్ముతున్నాం. అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయంపై చర్చించాలి. జిల్లాలో సుమారు 12 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై సుమారు రెండు నెలలు అవుతున్నా తల్లికి వందనంపై క్లారిటీ ఇవ్వలేదు. జిల్లాలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు అరికట్టాలి. వీటిపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తాలి.

– ఎల్ఎస్.లక్ష్మి, ఏఐఎమ్ఎస్ మహిళా సంఘం ఇన్‌చార్జి, తిరుపతి

ప్రజాసమస్యలపై గళమెత్తాలి



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై జిల్లా ఎమ్మెల్యేలు గళం విప్పాలి. గత ప్రభుత్వం అమలు చేసిన, పెండింగ్‌లో ఉన్న విద్య, వైద్యరంగాలకు సంబంధించిన పనులను ఆపివేయకుండా నిధులు కేటాయించి పూర్తిచేయాలి. వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించే రైతుభరోసాను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చే విధంగా ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలి. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలి. నిరుద్యోగులకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ వర్సిటీని త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రజాస్వామ్యంలో కక్ష్యసాధింపు చర్యలను విడనాడి జిల్లా అభివృద్ధికి సహకరించేలా ఎమ్మెల్యేలు తమ గళాన్ని అసెంబ్లీలో వినిపించాలి.

–శ్యామ్‌సుందర్, పరిశోధక విద్యార్థి, శ్రీకాళహస్తి

సూపర్‌సిక్స్ హామీలపై గట్టిగా నిలదీయాలి



అసెంబ్లీ సమావేశాలలో గవర్నర్ ప్రసంగం నిరాశ కలిగించింది. ఓటాన్ అకౌంట్‌తో అభివృద్ధి అసాధ్యం. సూపర్‌సిక్స్ హామీలకు చరమగీతం పాడేందుకే కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి ఓటాన్ అకౌంట్‌ను తెరపైకి తెచ్చింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి. పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధిని కొనసాగించింది. తొలి బడ్జెట్ సమావేశాల్లోనే ఇచ్చిన హామీల్లో 90 శాతం పథకాలకు బడ్జెట్ కేటాయించింది. సూపర్‌సిక్స్ హామీలపై జిల్లాలోని ఏడుగురు ప్రజాప్రతినిధులు తమ వాణిని అసెంబ్లీలో గట్టిగా వినిపించాలి.

–రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపు



అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా నిరుద్యోగుల ప్రస్తావన లేదు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఆ మాట ఎత్తడం లేదు. జిల్లాలో సుమారు 6 లక్షలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. వారంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో పాటు జాబ్ క్యాలెండ్ విడుదల చేసి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలి. జిల్లాలో అందరూ కూటమి ఎమ్మెల్యేలే ఉన్నారు. నిరుద్యోగుల హామీలపై అసెంబ్లీలో గళమెత్తాలి.

–హరీష్, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, చంద్రగిరి

అండర్ -16 క్రికెట్ పోటీలు ప్రారంభం

వెంకటగిరి రూరల్: ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-16 విభాగం క్రికెట్ పోటీలు పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి ఇన్నింగ్స్‌లో విశాఖపట్నం- విజయనగరం జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తొలుత టాస్ గెలిచిన విశాఖపట్నం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 53.03 ఓవర్లకు 101 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో హిమల్ 28 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు 36 ఓవర్లకు 176 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది. జట్టులో భానుశ్రీహర్ష 80 పరుగులు, రోహణ్ గణపతి 28 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో గౌతమ్ ఆర్య 4 వికెట్లు తీశారు. విజయనగరం జట్టు బౌలింగ్ విభాగంలో దేవిచరణ్ 2 వికెట్లు పడగొట్టాడు. 75 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు లీడ్‌లో ఉంది.

పగతోనే చంపేశాడు!



నిందితుడిని చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: నగరంలోని రాయల్‌నగర్‌లో సంచలనం సృష్టించిన హత్య కేసులో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. తనపై తప్పుడు ప్రచారం చేశారనే పగతో హంతకుడు ఓ వృద్ధురాలిని దారుణంగా హత్య చేసినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఈనెల 18న జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో రాయల్‌నగర్ నాలుగో క్రాస్‌లో నివాసముంటున్న పిన్నబోయిన శ్రీనివాసులు(22) అలియాస్ శ్రీను, చిన్నను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. హత్య గురించి విచారించగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయన్నారు. తిరుపతి రాయల్ నగర్‌లో శ్రీనివాసరావు తల్లి జయలక్ష్మి, భార్య రక్ష, కూతుళ్లు ప్రేరణ, నియతి నివసిస్తున్నారని, వీరి పక్కింట్లోనే హంతకుడు శ్రీనివాస్ కూడా నివాసముంటున్నాడని చెప్పారు. 2019లో తన తండ్రి మందలించాడని శ్రీనివాస్ హైదరాబాద్ వెళ్లి అక్కడే హాస్టల్‌లో ఉంటూ వెయిటర్‌గా పనిచేశాడు. అయితే శ్రీనివాసరావు భార్య రక్ష ముద్దాయి శ్రీనివాస్ ఎవర్నో ఒక అమ్మాయిని తీసుకొని వెళ్లిపోయాడని ప్రచారం చేసింది. మృతురాలు జయలక్ష్మి కూడా శ్రీనివాస్ కనిపిస్తే తిట్టేది. దీంతో వీరిపై అతను కక్ష పెంచుకున్నాడు.

గతంలోనే ఒకసారి భయం చూపించాడు

శ్రీనివాస్ 2003 మార్చిలో జయలక్ష్మి, రక్షను భయపెట్టాలని వారి ఇంట్లో సన్‌సైడ్‌పై ఎదురుగా మూడు ఖాళీ బీరు బాటిల్స్‌లో పెట్రోల్ పోసి ఒత్తులు పెట్టి మండించాడు. అదేవిధంగా 20 రోజుల క్రితం సీసీ కెమెరాలకు కనిపించకుండా దుప్పటి అడ్డం వేసుకొని ఇంట్లోకి వెళ్లాలని ప్రయత్నించగా పెద్ద గాలి రావడంతో దుప్పటి కిందపడిపోయింది. ఈ క్రమంలో వారిపై కక్ష పెంచుకొని జయలక్ష్మిని హతమార్చి, అడ్డొచ్చిన చిన్న మానవరాల్ని, అదే సమయంలో ఇంటికి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలిని గాయపరిచాడని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై టీడీపీ వేధింపులు

- సీడీపీఓ ద్వారా రాజీనామా చేయాలని ఒత్తిడి
- ఒత్తిడి తాళలేక స్వస్థతకు గురైన కార్యకర్త

శ్రీకాళహస్తి రూరల్: టీడీపీ నేతల ఒత్తిళ్లు తాళలేక ఓ అంగన్‌వాడీ కార్యకర్త తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి మండలం, మన్నవరం గ్రామంలో చోటుచేసుకుంది. మన్నవరం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో వీ.గాయత్రి అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామంలోని స్థానిక టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తపై కక్షగట్టారు. శ్రీకాళహస్తి సీడీపీఓ ద్వారా రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా అంగన్‌వాడీ కార్యకర్త స్థానికంగా ఉండడం లేదన్న సాకుతో సీడీపీఓ ద్వారా మెమో ఇప్పించారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో అంగన్‌వాడీ కార్యకర్త సీఐటీయూ నాయకుల ద్వారా కలెక్టర్‌ను కలిసి తన పరిస్థితిని వివరించారు. కలెక్టర్‌ను కలిశారన్న కోపంతో మంగళవారం సీడీపీఓ శాంతిదుర్గ గ్రామంలోకి వచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలను, గ్రామంలోని బాలింతలను ఎవర్నీ వివరణ చేయకుండా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్త పైన చర్యలు తీసుకునేందుకు పూనుకున్నారు. ఇదేమిటని అడిగిన అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీఓతో పాటు గ్రామానికి చెందిన కొందరు టీడీపీ మహిళలు దురుసుగా ప్రవర్తించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆపై అంగన్‌వాడీ కేంద్రం వద్దే అస్వస్థతకు గురై పడిపోయారు. స్థానికులు 108 వాహనంలో ఆమెను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తను సీఐటీయూ జిల్లా నాయకులు పరామర్శించారు.



మన్నవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద స్పృహ తప్పి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి

ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన

సీడీపీఓ శాంతిదుర్గ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగించేందుకు పూనుకున్నారని, ఈ క్రమంలో వారి వద్ద నుంచే రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ సీడీపీఓ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు అంగన్‌వాడీ కార్యకర్తపై కూడా రాజకీయ వేధింపులు మొదలయ్యాయన్నారు.

గ్రామస్తుల ఫిర్యాదుతోనే విచారణ

శ్రీకాళహస్తి మండలం, మన్నవరం గ్రామ సెక్టార్ సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశాం. ఇందులో రాజకీయం ఏమీ లేదు. అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో భాగంగా స్కూల్ టీచర్‌తో కలిసి ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్యం, పోషణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం తిరిగి వస్తుండగా మన్నవరం గ్రామస్తులు అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా విధులు నిర్వహించలేదని ఫిర్యాదుచేశారు. వారు ఇచ్చిన నివేదికను మాపై ఉన్నతాధికారులకు పంపుతాము. మా డ్యూటీ మేం చేస్తున్నాం. గ్రామంలో ఫిర్యాదు వస్తే వెళ్లి విచారణ చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. మాపై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

– శాంతిదుర్గ సీడీపీఓ, శ్రీకాళహస్తి

క్లుప్తంగా

ప్రమాదం తప్పేలా గోడ నిర్మాణం


విద్యుత్ మీటర్ల వద్ద గోడ నిర్మిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

చంద్రగిరి : స్థానిక ద్వారకా నగర్‌లోని ఇంటిగ్రేటెడ్, బీసీ బాలికల హాస్టల్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ మీటర్లు, ఇన్వర్టర్లు ఉన్నాయి. దీనిపై ఈ నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన వార్డెన్ మాలతి, హాస్టల్ మెట్ల కింద విద్యుత్ మీటర్లు, ఇన్వర్టర్ల కారణంగా విద్యార్థినులకు ప్రమాదం వాటిల్లకుండా ప్రత్యేకంగా గోడ నిర్మాణం చేపట్టారు. వార్డెన్ మాట్లాడుతూ ఇప్పటికే గోడ నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా హాస్టల్‌లో వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పిల్లలకు కాచి చల్లార్చి వడగట్టిన నీటినే అందిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే బీసీ బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ భవనం కేటాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మహిళా వర్సిటీ వీసీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ ఉమ

తిరుపతి అర్బన్ : కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో శ్రీపద్మావతీ మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి వర్సిటీ అభివృద్ధి పనులపై చర్చించారు.

వెనుకబాటులోనే ముదిరాజ్‌లు


మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి కల్చరల్ : రాష్ట్ర విభజన అనంతరం బీసీ కమిషన్ వేసి నివేదిక సమర్పించాలని కోర్టు ఆదేశించినా అప్పటి టీడీపీ సర్కార్ నిర్లక్ష్యం కారణంగా ముదిరాజ్‌లు ఇప్పటికీ వెనుకబాటులోనే ఉన్నారని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ–ఏ కేటగిరీలో చేర్చి వారి అభ్యున్నతికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో సైతం ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. నామినేటెడ్ పదవులను సైతం కేటాయించి సామాజిక న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో మహాసభ ప్రతినిధులు నారాయణమ్మ, హేమలత, లక్ష్మీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం గంగమ్మను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సైతం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ఉమ, క్రీడాకారిణి రజని

తిరుపతి సిటీ: క్రీడలలో రాణించే విద్యార్థినులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మహిళా వర్సిటీ వీసీ వి.ఉమ పేర్కొన్నారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీ వేదికగా జరిగిన అండర్–14బాలికల అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆమె నేషనల్ హాకీ ప్లేయర్ రజనితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. చిన్న వయస్సు నుంచి క్రీడలలో రాణించే విద్యార్థినులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థినులను చిన్న వయస్సు నుంచి క్రీడల వైపు ప్రోత్సహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. వర్సిటీలో అంతర్‌జిల్లాల టోర్నమెంట్ జరగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నేషనల్ హాకీ ప్లేయర్ రజనీ మాట్లాడుతూ చిన్నవయస్సు నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని రాణిస్తే అంతర్జాతీయ స్థాయికి చేరుకోవచ్చన్నారు. అందుకు తానే ఉదాహరణ అని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. సాధన చేస్తూ శ్రమిస్తే విజయం సొంతమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.రజని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీరేనా..
ఆశలు నెరవేరేనా?




ఎన్నికల హామీలు నెరవేరుస్తారా..? ఓట్ల కోసం చెప్పిన మాటలు నిలబెట్టుకుంటారా..? తిరునగరి ఖ్యాతిని జగద్విఖ్యాతం చేస్తారా..? రహదారుల విస్తరణకు బాటలు వేస్తారా..? భూగర్భ డ్రైనేజీ కల పరిపూర్ణం చేయగలరా..? తిరుపతిలో ట్రాఫిక్ సమస్యలకు కళ్లెం వేయగలరా..? యువత ఉన్నత భవిత కోసం ఐటీ హబ్‌ను తీసుకురాగలరా..? పవిత్ర నగరంలో నేరాలను అరికట్టగలరా..? చంద్రగిరి శోభను ఇనుమడింపజేస్తారా..? రాయలచెరువును పర్యాటక కేంద్రంగా మార్చగలరా..? కబ్జాకోరల్లో చిక్కుకున్న హథీరాంజీ మఠం భూములను పరిరక్షించగలరా..? తలకోన జలాలతో మెట్టభూములను సస్యశ్యామలం చేయగలరా..? ఉద్యాన రైతులకు మద్దతుగా శీతలగిడ్డంగులను నిర్మించగలరా..? ఇలా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గవాసుల మదిలో ఎన్నో ప్రశ్నలు. అందరి బతుకులు మారుస్తాంటూ గద్దెనెక్కిన ఎమ్మెల్యేలు సమస్యల పరిష్కారంలో అసెంబ్లీ సాక్షిగా గళమెత్తి చిత్తశుద్ధిని చూపిస్తారా అనే సందేహాలు ప్రజలను వెంటాడుతున్నాయి.

– తిరుపతి సిటీ / రూరల్

- కూటమి ఎమ్మెల్యేల సమర్థతను పరీక్షించేలా సవాళ్లు
- అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించాల్సిన పలు అంశాలు
- తిరుపతి, చంద్రగిరి అభివృద్ధిపై ప్రజల ఆకాంక్షలు

తిరుపతి నియోజకవర్గంలో సమస్యలపై కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అసెంబ్లీ వేదికగా మాట్లాడాలని నగర ప్రజలు ఆశిస్తున్నారు. ఈ మేరకు ప్రస్తావించాల్సిన అంశాలను వివరిస్తున్నారు.

- 40 ఏళ్ల పురాతన డ్రైనేజ్ వ్యవస్థ స్థానంలో నూతన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు
- తాగునీటి సమస్యను తీర్చేందుకు బాలాజీ రిజర్వాయర్, గాలేరు–నగరి సుజల స్రవంతిని పూర్తి చేయాలి
- చంద్రబాబు గత పాలనలో శిలాఫలకంతోనే ఆగిపోయిన సైన్స్ మ్యూజియం, క్రికెట్ స్టేడియం నిర్మాణం చేపట్టాలి
- నగరంలో ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాల అయినా ఏర్పాటు చేయాలి
- తిరుపతిలో రోజురోజుకు పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని రోడ్లు విస్తరించాలి
- నగరంలో ఐటీ హబ్ నెలకొల్పి ఇతర ప్రాంతాలకు యువత వలసపోకుండా ఉద్యోగాలు కల్పించాలి
- క్రైమ్ రేట్ కట్టడికి పకడ్బందీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని తొలిసారి ఎన్నికై అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం, సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ప్రాధాన్యతనివ్వాల్సిన అంశాలను వెల్లడిస్తున్నారు.

- పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వేదాంతపురం, రామానుజపల్లె సర్కిల్, తనపల్లె సర్కిల్ వద్ద అండర్ పాస్‌లు నిర్మించాలి
- రాష్ట్రంలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటైన రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. అక్కడ సందర్శకుల కోసం బోటింగ్, ఉద్యానవనం ఏర్పాటు చేయాలి
- గతంలో కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి నదిపై కొట్టుకుపోయిన తిరుచానూరు, తనపల్లె, చిగురువాడ, వేదాంతపురం వద్ద బ్రిడ్జిలను నిర్మించాలి.
- అవిలాల, తుమ్మలగుంట, సి.మల్లవరం, పుదిపట్ల పంచాయతీల్లో ఆక్రమణకు గురైన హథీరాంజీ మఠం భూములను కాపాడాలి.
- చెర్లోపల్లె నుంచి శ్రీనివాసమంగాపురం–చంద్రగిరి రోడ్లను విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి
- ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు దామినేడు గృహ సముదాయానికి డ్రైనేజీలు నిర్మించాలి
- తిరుపతి సమీపంలోని పంచాయతీలకు తెలుగు గంగ నీటిని అందించాలి
- తలకోన జలపాతం నుంచి వచ్చే నీటిని ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లోని చెరువులకు మళ్లించాలి
- చిన్నగొట్టిగల్లు మండలంలో ఉద్యానపంటల నిల్వకు కోల్డ్ స్టోరేజ్ నిర్మించాలి. పాకాల మండలంలో మామిడి గుజ్జు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి
- ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీల్లోని ప్రభుత్వ భూముల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు నెలకొల్పాలి – రామచంద్రాపురం మండలంలో మెడికల్ హబ్ ఏర్పాటు చేయాలి

రూ.350కోట్లు అవసరం



తిరుపతి నగరంలో జనసాంద్రత ఎక్కువ. తిరుమలకు వెళ్లే భక్తులు సుమారు లక్షకు పైగా నగరం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. 40 ఏళ్లకు ముందు నిర్మించిన యూడీసీ సిస్టమ్ పూర్తిగా దెబ్బతింది. అధునాత డ్రైనేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలంటే సుమారు రూ. 350కోట్లు అవసరం. దీనిపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలి.

– నారాయణ. సీనియర్ సిటిజన్, తిరుపతి

తాగునీటి సమస్యపై గళమెత్తాలి



తిరుపతిలో తాగునీటి సమస్యను తీర్చేందుకు బాలాజీ రాజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. గాలేరు నగిరి సుజలస్రవంతి నుంచి రెండు జిల్లాలకు తాగునీటిని తీసుకునే వెసులుబాటు ఉంది. దీంతో పాటు తెలుగుగంగ నుంచి నగరానికి సరిపడా నీరు తీసుకువచ్చేందుకు కృషి చేయాలి. ప్రస్తుతం కండలేరు నుంచి తాత్కాలికంగా నెలరోజులకు సరిపడా నీటిని తెచ్చేందుకు రూ.80లక్షలకు పైగా నిధులు ఖర్చు చేశారు. దీనిపై టీటీడీ సహకారం తీసుకునేందుకు చర్యలు చేపట్టాలి.

– విజయలక్ష్మి, ప్రైవేటు కళాశాల అధ్యాపకులు, తిరుపతి

ఐటీ హబ్‌గా మార్చాలి



తిరుపతిని ఐటీ హబ్‌గా మార్చాలి. దీంతో చాలా వరకు నిరుద్యోగ సమస్యను తగ్గించవచ్చు. దీనికోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలి. తిరుపతిలో పేరొందిన విశ్వవిద్యాలయాలు, కేంద్ర విద్యాసంస్థలు ఉన్నాయి. నాణ్యమైన విద్యను అభ్యసించే వెసులుబాటు ఉండే నగరంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవు. దీంతో ప్రతిభ గల యువత దేశ, విదేశాల బాట పడుతున్నారు. ఈ విషయంపై ప్రధానంగా అసెంబ్లీలో చర్చించాల్సిన అవసరం ఉంది

– శ్రీవాణి, ఐటీ ఉద్యోగి, తిరుపతి

నిధులు కేటాయించాలి



రాయలచెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలి. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో 500 ఏళ్ల క్రితం ఏడు మిద్దెల లోతుతో నిర్మించిన రాయలచెరువు ప్రస్తుతం దీనావస్థలో ఉంది. పెద్దేటి వంక ప్రవాహానికి చెరువు పూడికకు గురై రెండు మిద్దెల లోతు మాత్రమే మిగిలింది. ఈ చెరువులో నీరు నిల్వ ఉంచితే పరిసర ప్రాంతాల్లో 7 మండలాల వరకు నీరు సమృద్ధిగా ఉంటుంది. కేంద్రం రాయలసీమకు ప్రత్యేకంగా కేటాయించిన బడ్జెట్ నుంచి రాయలచెరువు సమీపంలోని ముంపు రైతులకు నష్టపరిహారం కల్పించి పూడికతీత పనులు చేపట్టాలి.

– మురగయ్య, రాయలచెరువు

నిబంధనల మేరకే వాటర్ బాటిళ్ల విక్రయం

తిరుమల: శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు టీటీడీ నిర్దేశించిన రేట్లకే వాటర్ బాటిళ్లు విక్రయించాలని జేఈఓ(విద్య, ఆరోగ్యం) గౌతమి తెలిపారు. తిరుమలలోని ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ తిరుమలలోని దుకాణదారులు టీటీడీ నిర్దేశించిన రేట్ల కంటే అధిక రేట్లకు వాటర్ బాటిళ్లు అమ్ముతున్నారని, ఖాళీ గాజు బాటిళ్లు తీసుకోవడం లేదని పలువురు భక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. టీటీడీ ఈఓ ఆదేశాల మేరకు, తిరుమలలోని దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. తిరుమలలోని అన్ని దుకాణాలలో ఒకే రేటుతో వాటర్ బాటిళ్లు విక్రయించాలని, ఖాళీ గాజు బాటిల్ తీసుకొని భక్తులకు డబ్బులు తిరిగి ఇవ్వాలన్నారు. అదేవిధంగా దుకాణదారులు తమ దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జేఈఓ ఆదేశించారు. ఇందుకు దుకాణదారులు తమ అంగీకారం తెలిపారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, ఇన్‌చార్జ్ హెల్త్ అధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఆరోగ్యశాఖ అధికారులు, దుకాణదారులు పాల్గొన్నారు.

వేగవంతంగా వర్మి కంపోస్టు తయారీ


అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ శిరీష

చంద్రగిరి(తిరుచానూరు): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నుంచి వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని మరింత వేగవంతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో–ఆర్డినేటర్ శిరీష అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె తిరుచానూరు పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వసతులు, పరికరాలు, చెత్త నుంచి సంపద తయారు చేసే యంత్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఎస్‌డబ్ల్యూపీసీను పరిశీలించి, అక్కడ కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పరుచుకోవాలన్నారు. వర్మి కంపోస్టు తయారు చేసి వాటిని ఆదాయం చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతామన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు కేంద్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ ప్రకారం పంచాయతీ కార్మికులు తడి, పొడి చెత్తలను ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం ద్వారా వర్మి కంపోస్టు తయారీ విధానం సులభతరమవుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి శివశంకర్ రాజుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి.. వసతుల కల్పనే అజెండా


- శ్రీవారి అనుగ్రహంతోనే తిరుపతిలో విధులు
- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- కార్పొరేషన్ కొత్త కమిషనర్ మౌర్య
- నేడు బాధ్యతల స్వీకరణ



తిరుపతి తుడా : ఆధ్యాత్మిక తిరునగరి అభివృద్ధి.. మెరుగైన వసతుల కల్పనే అజెండాగా కృషి చేయనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్ ఎన్.మౌర్య స్పష్టం చేశారు. శ్రీవారి అనుగ్రహంతోనే తిరుపతిలో విధులు నిర్వర్తించే అవకాశం లభించిందని వెల్లడించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో 'సాక్షి'తో మంగళవారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే..

- తిరుపతిలో విధుల నిర్వహణను ఛాలెంజింగ్‌గా తీసుకుంటా. అభివృద్ధి పనులను కొనసాగిస్తూ ప్రజలకు ఆధునిక వసతుల కల్పనకు కృషి చేస్తాం.
- స్వచ్ఛ సర్వేక్షణ్, స్మార్ట్ సిటీ వంటి ప్రాజెక్టులను పకడ్బందీగా అమలు చేయిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం.
- అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ, బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం.
- ఈ క్రమంలోనే సేవాదృక్పథంతో విధులు నిర్వర్తించేవారికి ప్రాధాన్యత ఇస్తాం.
- నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పెద్దపీట వేస్తాం. తిరుపతివాసులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తాం. ప్రజలకు కూడా నగర పరిశుభ్రత కోసం మున్సిపల్ కార్మికులకు సహకరించాలి.
- తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. భవిష్యత్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. కల్యాణీడ్యామ్, కైలాసగిరి రిజర్వాయర్లలో నీటి నిల్వలపై దృష్టి సారిస్తాం. నిత్యం ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పవర్ బోర్లు వేయించేందుకు కృషి చేస్తాం.
- శ్రీవారి దర్శనార్థం రోజూ తరలివచ్చే వేలాదిమంది యాత్రికులను దృష్టిలో ఉంచుకుని సదుపాయాలు కల్పిస్తాం. తిరుపతి నగరపాలక సంస్థను అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తాం. ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తాం.

వీసీలు, రిజిస్ట్రార్‌కు అభినందనలు


వీసీని అభినందిస్తున్న అకాడమీ సభ్యులు

తిరుపతి సిటీ : తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్‌చార్జి వీసీ ఆచార్య సీహెచ్ అప్పారావు, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య ఉమ, వెటర్నరీ వర్సిటీ వీసీ ఆచార్య జేవీ రమణ, ఎస్వీయూ నూతన రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకు అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు అభినందనలు తెలిపారు. సోమవారం ఈ మేరకు వీసీలు, రిజిస్ట్రార్‌ను అకాడమీ కార్యదర్శి సురేంద్ర నాయుడు, కోశాధికారి ఆచార్య కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడు ఏపీ నాయుడు, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఉదయకుమార్ సత్కరించారు.

కళ్యాణ కట్టలో పరిశుభ్రత మెరుగుపడాలి

- అన్నప్రసాదాలపై సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు
- టీటీడీ ఈఓ జె. శ్యామలరావు

తిరుమల: శ్రీవారి కల్యాణ కట్టలో పరిశుభ్రత ఇంకా మెరుగుపడాలని, నిరంతరాయంగా వేడి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఈఓ జె.శ్యామలరావు ఆదేశించారు. జేఈఓ గౌతమితో కలిసి కళ్యాణకట్టను పరిశీలించారు. బాత్ రూంలు, ఇతర హాల్స్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. కళ్యాణ కట్టలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డీటీఎస్ ఏజెన్సీ వారు నాణ్యమైన శానిటరీ పరికరాలు, వస్తువులు సరఫరా చేసేటట్లు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. కళ్యాణ కట్టలోని అత్యంత పాత గీజర్లు, పగిలిన టైల్స్‌ను గమనించి వాటిని వెంటనే మార్చాలని ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. అలాగే విరిగిన నీటి కొళాయిలు, పనిచేయని ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డులు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, ఎలక్ట్రికల్, ఇతర ఇంజినీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఈఓ మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్నప్రసాదాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, అన్నదానం డిప్యూటీ ఈఓ రాజేంద్ర, ప్రత్యేక అధికారి శాస్త్రి, ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈఓ ఆశాజ్యోతి, ఇన్‌చార్జ్ హెల్త్ ఆఫీసర్ సునీల్ కుమార్, ఎస్ఈ– 2 జగదీశ్వర్ రెడ్డి, డీఈ(ఎలక్ట్రికల్) రవిశంకర్ రెడ్డి, ఈఈ జగన్మోహన్ రెడ్డి, కేకేసీ ఏఈఓ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుపతిలో జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉప ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాన్‌స్టాండ్ సంస్థలో టెక్నీషియన్/హెల్పర్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ విద్యార్హత, ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మెకానిక్స్/సేల్స్ అడ్వైజర్స్ ఉద్యోగాలకు ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, ఫిట్టర్ విద్యార్హత, శ్రీజ మిల్క్ సంస్థలో ఫీల్డ్ కెమిస్ట్ ఉద్యోగానికి గ్రాడ్యుయేట్ ఇన్ సైన్స్ /డిప్లొమో (కెమిస్ట్/మైక్రోబయాలజీ) విద్యార్హత, అపోట ఫార్మాసిస్ లిమిటెడ్ సంస్థలో ఆర్టీఏ (ఫ్రెషర్స్) ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ విద్యార్హత, ఫస్ట్‌మ్యాన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్స్ (పురుషులకు మాత్రమే) ఉద్యోగాలకు పది ఆ పై విద్యార్హత కలిగిన వారు ఇంటర్వ్యూలకు రావాలని వివరించారు. ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు 18 నుంచి 30ఏళ్లలోపు యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 81210 15844, 89194 65770 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ చరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నగరంలోని జీఎస్ మాడా స్ట్రీట్, రైల్వే కాలనీ, బైరాగిపట్టెడ, లక్ష్మీపురం, ఎస్ఎన్ పురం, ఎమ్మార్‌పల్లె, నెహ్రూనగర్, చెన్నారెడ్డి కాలనీ, అక్కారంపల్లె, వరదరాజనగర్, రాళ్లపల్లె సర్కిల్, కేటీ రోడ్డు, మారుతీనగర్, కొర్లగుంట, టాటానగర్, శాంతినగర్, జీవకోన, క్రాంతినగర్, జీఎమ్ స్ట్రీట్, ఆర్ఎస్ గార్డెన్స్, శివజ్యోతినగర్, భవానీనగర్, ఎమ్‌కే నాయుడు కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, న్యూబాలాజీ కాలనీ, గోవింద్‌నగర్, నవాబ్‌పేట్, గాలి వీధి లోని నిర్దేశిత పాఠశాలలు, కళాశాలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

స్టాండింగ్ కౌన్సిల్ పదవికి పోటాపోటీ

తిరుపతి లీగల్ : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయ సలహాదారు) పదవికి కూటమి పార్టీలకు చెందిన లీగల్ సెల్ న్యాయవాదులు పోటాపోటీగా దరఖాస్తులు అందజేసినట్లు తెలిసింది. కౌన్సిల్ పదవికి దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్‌కు కార్పొరేషన్ కమిషనర్ ఇటీవలే ఉత్తర్వులు పంపించారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన సుమారు 35 మందికి పైగా స్టాండింగ్ కౌన్సిల్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు కొంతమంది ఎమ్మెల్యే సిఫార్సు కోసం ప్రయత్నిస్తుండగా, మరి కొందరు మంత్రులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.

రేపటి నుంచి సంగీత.. నృత్యోత్సవాలు


మాట్లాడుతున్న మోహన్ సుందరం

తిరుపతి కల్చరల్ : నగరంలోని త్యాగరాజ మండపంలో గురువారం నుంచి సోమవారం వరకు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మోహన్ సుందరం, కార్యదర్శి కంచి రఘురామ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ 25వ తేదీన ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల మంగళధ్వనితో ఉత్సవాలు ఆరంభమవుతాయన్నారు. పద్మ విభూషణ్ డాక్టర్ కె.శివరామన్, మాజీ చీఫ్ ఎన్నికల కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు వివరించారు. అనంతరం సిక్కిల్ గురుచరణ్ బృందం గాత్ర కచేరీ ఉంటుందన్నారు. 26న ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు, అనంతరం షిమోగా కుమారస్వామి వాయిద్య సంగీత కచేరి, ఆర్.సూర్యకుమార్ బృందం సంగీత కచేరి జరుగుతుందని తెలిపారు. 27న ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థుల వాయిద్య సంగీతం, అనంతరం తిరుమలై బ్రదర్స్ భక్తి సంగీత విభావరి, ప్రియా సిస్టర్స్ గాత్ర కచేరీ ఉంటుందని చెప్పారు. 28న సోమయాజుల బృందం జలతరంగ వాయిద్య ప్రదర్శన, రాత్రి కళాకారిణి కన్యాకుమారి బృందం సంగీత కచ్చేరి చేపడతారని తెలిపారు. 29న డాక్టర్ నిత్యశ్రీ బృందం, టీఎస్ పట్టాభిరామ పండిత్ బృందం గాత్ర కచేరీలు ఉంటాయని వెల్లడించారు. సమావేశంలో కమిటీ కోశాధికారి భానుమూర్తి, ట్రస్టీలు భీమాస్ అశోక్, ప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ తవితా తులసీ

తిరుపతి కల్చరల్ : దివ్యాంగుల మనోభావాలను దెబ్బతీసిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మహిళా వర్సిటీ ప్రొఫెసర్ తవితా తులసి డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు రద్దు చేయాలని, వారు పనిచేసేందుకు పనికిరారని ట్వీట్ చేయడం దారుణమన్నారు. దివ్యాంగులను కించపరుస్తూ హేళన చేసినందుకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ అమరేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం దేశంలో అందరూ సమానమేనని, దివ్యాంగులను స్మిత సబర్వాల్ అవమానించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణమే ఆమె దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడబ్ల్యూడి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్రమణ్యం మాట్లాడుతూ దివ్యాంగులకు రిజర్వేషన్లు తొలగించాలని ఒక ఐఏఎస్ అధికారి ట్వీట్ చేయడం హేయమని మండిపడ్డారు. సమావేశంలో లా విద్యార్థి వెంకటరమణ, ఫెడరేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణమ్మ, మధులత పాల్గొన్నారు.

సందేశాత్మకం.. నాటకోత్సవం


కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు సందేశాత్మకంగా సాగాయి. మధ్యాహ్నం ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర పౌరాణిక పద్యనాటకం ఆధ్యాత్మిక భావాలను ఇనుమడింపజేసింది. వైజాగ్‌కు చెందిన నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన శిథిలజీవి సాంఘిక నాటిక ఆలోచనలను రేకెత్తించింది. గుంటూరుకు చెందిన ఆరాధన ఆర్ట్స్ అకాడమీ వారు ప్రదర్శించిన క్షేత్రం సాంఘిక నాటిక ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు అలరించాయి. కళాకారులను నిర్వాహకుడు బీఎన్ రెడ్డి ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థులతో ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించిన 'స్పేస్ వీక్' కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పద్మావతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. నారాయణమ్మ చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందించారు.